# గాలివాన

## [పాటకథ]

గాలివాన వచ్చి పంటల్ని గట్టులమీద కెక్కిస్తే, ఇళ్ళు కూలిపోయి, బళ్ళు తలక్రిందులై, పల్లూ ఊళ్ళూ ఏళ్ళైపోయి సెలయేళ్ళు మహానదులై, కొండవాగులు గోదావరీనదులై, మేఘాలే భూమికి దిగివచ్చి, ప్రపంచంలోని సముద్రాలన్నీ ఎత్తివచ్చి, శివాలెత్తి, పరవళ్ళెత్తి, అవన్నీ అంబరము హత్తుకుపోయి ప్రళయరుద్రుడు తాండవం చేస్తే, కాలరుద్రుడు గంతులు వేస్తే, విలయరుద్రుడు వీరాంగం ఆడితే విరుచుకుపడింది— తుపాను విశాఖపట్నం జిల్లాపైనా, తందానా!

ఈ మహాప్రళయం మధ్యనే కారుపల్లెగ్రామం, గ్రామం మధ్యన భైరి అప్పలస్వామియిల్లు అప్పలస్వామి . ఆరితేరిన రైతు. అన్నమాట నిలబెట్టుకొనే దిట్టరి. అసలయిన కాపు. సిసలైన గుణాలవాడు తందానా!

గడపదాటి పైకి కాలుపెట్టిన అప్పలస్వామికళ్ళకి ప్రత్యక్షంఅయ్యాయి— పడిపోయిన పంటలూ, పాడైపోయిన చేలూ, కూలిపోయినగోడలు, కొట్టుకుపోయినఊళ్ళు, గోల పెడుతున్న ప్రజలు, తందానా తాన తందానా!

ఇళ్ళు లేవు, వాకిళ్ళు లేవు, గృహాలు పడిపోతే దేహాలు వదిలేసినవాళ్ళు, వరదల్లో కొట్టుకుపోయినవారు, ఇదివరదాకా ఉన్న సగంకాటకంతో ఎండిపోయారు జనులు. ఈ ప్రళయం

దివాలాతీసినవాళ్ళఇంట్లో దొంగలు పడ్డట్లేఅయింది తందానా తానా, తానా తందానా తానా!

అన్నీ చూసిన అప్పలస్వామి తన పెద్దగాదెలు తలుపులు లాగిపారేశాడు. గుండిగల్లో వంటలు పెట్టించాడు. అండిగల్లో కూరలు వండించాడు. పాత్రల్లోపప్పులూ, బానల్లో పులుసులూ వండించాడు. బీదా మాత్రమే కాదు. సాదా మాత్రమే కాదు, అందరికీ, ఆబాలగోపాలానికి కొద్దివారికీ గొప్పవారికీ ముసలివారికీ ముతకలకీ, బిడ్డలకి, పెద్దలకీ, ఆడవారికీ అష్టాదశవర్ణాలికీ అన్నమో రామచంద్రా అని వచ్చిన వారందరికీ, సిగ్గుబడినా, మొహమాటంపడినా అందరికీ అన్ని విధాలాకనుక్కొని కాశికాన్నదాతలా పెట్టాడండీ తానా, తానా, తందానా తందాన తానా!

## 2

కామమ్మ అప్పలస్వామికూతురు అందాలబరిణె, అనురాగాలపోగు. పెద్దరయితే అవసరంచేత ఊళ్ళో పంతుల్ని పెట్టి చెప్పించాడు చదువు. విజయనగరం పంపించాడు పెద్ద చదువుకు. తన చారడేసికళ్ళతో చూసిన పుస్తకం తప్పకుండా హృదయగతం. గులాబిపువ్వుపుటాలల్లా ఉన్న చెవులతో విన్న పాఠం బుద్ధిగతం. నవ్వితే నవరత్నాలు ఒలుకుతవి; నవకుసుమాలు వర్షాలుకురుస్తవి. తన తీయనికంఠంతో పాటపాడిందా గోవులు కదలవు, ఆవుదూడలు మెదలవు. నాగులు ఆడతాయి. వాగులు నృత్యంచేస్తవి. పక్షులు నిలిచి బొమ్మ

లవుతవి. ఆకాశంలో మబ్బులే ఆలకిస్తాయూ! తందానా! జయమ్మా!

ఆ అందాలబొమ్మ తుపానుసంగతి వినగానే కాలేజీ నుంచి, అన్నపూర్ణలా వచ్చిపడింది. చిన్నతనంలో కామమ్మా నేడు కామేశ్వరి, స్నేహితురాండ్రకు కాముడు, చుట్టాలకు కామం! తందాన తానా!

ఆ ఖండం అంతా కాటకంలో మండిపోతోంది. బియ్యం దొరకటంలేదు. జొన్నలు, చోళ్ళు, సజ్జలు, గంటెలు ప్రపంచంలోనే లేవో, అవి ఉద్భవించనేలేదో, అవి కథలలో మాత్రమే కనబడుతాయో తందనా! తందానా!

ఎంతమంది తల్లులు తమ తీపుల అడ్డాలబిడ్డలకు ఆకలి తీర్చడానికి పాలులేవని తల్లడిల్లిపోతున్నారో, కుళ్ళిపోతు న్నారో, తందానా తానా, తందా...నా!

గ్రామనాయకులు, జిల్లానాయకులు, దేశనాయకులు ఎంత గగ్గోలుపడినా, కంఠాలు బద్దలుకొట్టుకొని ఉపన్యాసా లిచ్చినా ధనం ఊడిపడదు, దాక్షిణ్యం తొణికిసలాడదు, ధర్మం ప్రత్యక్షం కాదు, వితరణం అవతరించదండో! తానా తానా; తందానా! తానా తందానా తానా!

అప్పలస్వామిగాడె ఖాళీ అయింది. పాతర్లు బయట పడినాయి. అప్పలస్వామిస్నేహితులు అరుదై పోయారు; చుట్టాలు చూపులేదు; పక్కాలు పత్తాదొరకరు; మొహమాటస్తులు మొహాలు చాటు వేసికొన్నారండి బాబూ, బాబూ, బాబూ, బంగారుబాబు వినరండో!

ఇంట్లోనగలన్నీ అమ్మాడు; వెండిసామానులమ్మాడు; భూములు తనఖాపెట్టి, ఈనాములు కుదువపెట్టి, విజయనగరం షావుకార్లను పట్టుకొని, జయ జయ అంటూ దొరికిన జొన్నలు, చోళ్ళు, గంటెలు, సజ్జలు, వరిగెలు పట్టుకువచ్చాడా అభినవ కర్ణుడు, శిబి, దధీచి అయిన అప్పలస్వామిగారా ఏమీ చూశారా తందానా తానా!

# 3

కామేశ్వరి విజయనగరం ఉత్తరాలు రాసి తనతో చదివిన స్నేహితురాళ్ళనందరినీ ఒక సంఘంగా కూడమంది, సభ్యురాండ్రను చేర్చమంది, సభలు చేయమంది, చందాలు వసూలుచేయమందీ, తండ్రి తందాన తందానా!

జనాభా ఎక్కువ, ధనాలా తక్కువ; తినడానికి కడుపుల సంఖ్య ఎక్కువ, తేవడానికి గింజలు తక్కువ: చచ్చినవాళ్ళు చచ్చారు. భగవంతుని ఇష్టంలేక చంపగలవారెవరు! చావ గలిగినవారెవరు అని అమ్మలక్కలందరూ వేదాంతాలాడారు, ఓ యమ్మలారా తందానా, తందానా!

తనఒంటినున్న నగలు రెండు వేలరూపాయలు వచ్చినవి; అవన్నీ తండ్రికి ఇచ్చింది కామేశ్వరీదేవి తందానా తందానా!

"ఓ అయ్యా, ఇవి అమ్మి ప్రజలకు పెట్టూ, తిండిలేక మాడుతున్నారు, బీదరైతులకు విత్తనాలకు గింజలులేవు, కూలికి సత్తువ లేదు.

"ఏ దేశమో పోయి
ఏదైన తినబోతె

నడచి పోలేరయ్యా
గడచి పోలేరు.
"ఆకారమే లేని
ఆ చిన్నికందులకు
పా లెక్కడున్నాయి
బ ట్టెక్కడున్నాది
కళ్ళు దించుకుపోవు
తల్లులట వారంత
తల్లి పిల్లలపాలి
దైవ మే డున్నాడు?"

"అమ్మా, నన్ను విజయనగరం పోనీ, ఏమవుతుందో,"
అన్నదండి ఆ అమ్మాయీ కామేశ్వరీదేవి తందానా!

## 4

టిక్కట్టులేకుండా ఆడవాళ్ళపెట్టెలో రైలెక్కింది. టిక్కెట్టు తనిఖీదారు టిక్కెట్టడిగాడు.

"లేదండి బాబూ!"

"నీవేషం బాగుంది. చదువుకుంటున్నావా?"

"అవునండి"

"ఏం చదువు?"

"బి. యస్. సి."

"వారేవా! నీ పేరు?"

"కామేశ్వరి"

"అల్లో కామేశ్వరీ! మరి డబ్బియ్యి, టిక్కట్టిస్తా!"

"అయ్యా! మా ఊరిలో కాటకదేవత కాలుపెట్టడం చేత, కడుపుకు లేక ప్రజలు మాడడంచేత విజయనగరంపోయి, పెద్దలకూ, పిన్నలకూ, ఉద్యోగులకూ, ఊళ్ళేలువారికి, ధనవంతులకూ, ఘనవంతులకూ మనవిచేసి ధనమో, ధాన్యమో వసూలుచేద్దామని బయలుదేరానండి" అన్నాది కామేశ్వరీదేవీ తందానా!

"టట్, డామిట్, అది కాదమ్మాయి, అందాలపడుచా! నీ మాట ఎవరు వింటారు? రా! నేను పెద్దల నెందరినో ఎరిగున్నవాణ్ణి, నీకు సహాయం చేయిస్తానన్నాడండీ, టిక్కట్టు కలకటేరూ తందానా!

"రాజ్యం దివాను నాకెరుక, మహారాజా నాకెరుక, కలక్టరు నాకెరుక, ఖామందు నాకెరుక, షాహుకార్లు నాకెరుక, సంపన్నులు నాకెరుక, నాతో రా, దివానుగారి దగ్గరకు తీసుకెడతా" నన్నాడండీ టిక్కట్టు కలకటేరు తందానా తానా!

రైలు ఆలస్యమై ఆరోజుసాయంకాలం ఏడుగంటలకు విజయనగరం చేరుకుంది. టిక్కట్టుకలక్టరు కామేశ్వరిని వెంటబెట్టుకొని, ఒక గుఱ్ఱంబండి చేయించాడు. వాడిచేతిలో రూపాయి పెట్టాడు. అయిదురూపాయలనోటు పెట్టాడు. అమ్మాయిని ఎక్కమన్నాడు. తా నెక్కాడండీ టిక్కట్టు కలకటేరూ తందానా!

గుఱ్ఱం మంచి జాతిది. బండివాడు గడుసురకంవాడు. ఛెల్ ఛెల్, పరుగెత్తింది, పట్నంబైటే, రస్తాదారిలో కోటవైపుకే పరుగెత్తిందీ; జాతిగుఱ్ఱమండీ తందానా!

కోట దాటింది, తోటదాటింది, పొలాలుదాటి విశాఖ పట్నం రోడ్డుపట్టింది. గుఱ్ఱంబండి వేగంగా వెళ్తోంది. దౌడు తీస్తోంది గుఱ్ఱం, జాతిగుఱ్ఱమండీ తందానా తానా తందానా!

బూతులుతిట్టూ గుఱ్ఱాన్ని తరుముతున్నాడుబండివాడు. ఉప్పొంగిపోతున్నాడు టిక్కట్టు కలక్టరు. బలే టిక్కట్టు కలకటేరు, తందాన తానా!

ఓహో! ఆకామమ్మకు భయమేసింది. గుండెల్లోదుడుకు పుట్టింది. ఓ కాశీఅన్నపూర్ణా, కంచికామాక్షీ, నన్నురక్షించు తల్లీ! అని లోన దండాలుపెట్టుకుంది, కామేశ్వరమ్మాయి తందానా, తందానానా, తాన తందానానా!

‘సార్ ఇంకా దివానుగారిఇల్లు ఎంతదూరం?’

‘ఇదిగో వచ్చాం! ఆపు బండీ!’

బండి ఆగింది; బండిదిగ్గాడా టిక్కట్ల ఇనస్పెక్టరు. ఆ అమ్మాయి దిగింది బండి. బండివాడు వెంటనే బండితిప్పి గబ గబ వెనక్కుతిప్పి విజయనగరందారిపట్టాడు. అది విజయనగరం దగ్గిరైనా కాని నిర్జనస్థలం. అమ్మయ్యో, భయమేసింది బంగారు తల్లికి తందానా!

‘ఇది ఏమిటండి బాబూ!’

‘ఇది తోట. ఆ ప్రక్కనే మేడ; పద, నా చేయిపట్టుకో!’

కాని అమ్మాయి చేయిపట్టుకోలేదు. అతగాడే ఆమె చేయి గబుక్కున పట్టుకోని, ఒక చిటికెలో గద్ద కోడిపిల్లను తన్నుకుపోయినట్లు పొలంలోకి లాక్కుపోయాడు. ఆ అమ్మాయి

భయంచేత "ఓ" యని మూర్ఛపోయింది. మా తల్లి కామేశ్వరీ తందానా!

మా బాగుందనుకోని ఆ రాక్షసుడు, రక్తంచరుడు, పిశాచి పొలంలోకి, సొమ్ముమూట ఎత్తుకుపోయే దొంగలా తీసుకుపోయాడు. వాడిబ్రతుకే నీచమైపోనూ తందానా!

ఆ మూర్ఛలాంటి కళ్ళల్లో, ఆమెఎదుట చిక్కిపోయిన వాళ్ళు, పాలులేని పిల్లలు, పంటలులేని రైతులు చేతులు చాచి కనబడ్డారు. మా తల్లి కామేశ్వరీదేవి కోయమ్మా తందానా!

ఒక్కసారిగా ఆ అమ్మాయికి మెలకువవచ్చింది. ఓశక్తి అయ్యిందండి, ఎలా విదిలించుకొందో వాడికౌగిలింత, కిందకి ఉరికింది. వాణ్ణి సాగదీసి లెంపకాయకొట్టి, ఆ పొలాలలో, గోతుల్లో, లేడిలా పరుగెత్తింది. వెనక వాడు, ముందు ఆమె దడదాడ దడదాడ తందానా తందానా తాన తాన తాన తందానా!

ఆమెని, ఆ రాక్షసు డందుకోలేకపోయాడు. ఒక రాయి తగిలి పడ్డాడు. ఆమె రోడ్డుమీదికి ఉరికిందండీ తందానా!

ఇంతలో కారులైట్లు. కారు ఆగి ఒక పెద్దమనిషి దిగి "ఎవరమ్మా మీరు" రన్నాడు దేవుడై అతడూ తందానా!

"అయ్యా రక్షించండి; ఆ రాక్షసుడు రైలు......
టిక్కెట్లు–దివాను–ఇల్లు–ఇక్కడికి అన్నాడు" అంది వగరుస్తూ" మా తల్లి కామేశ్వరీ తందానా!

"అమ్మా నీ పేరు?"

"కా...కా...కామేశ్వరండి."

"తల్లి నువ్వా! నేనే దివానును నీ ఉత్తరం అందింది. పక్కఊళ్ళో పని ఉండి, నువ్వు వస్తావని తొందరగా వస్తున్నా. రైతుబిడ్డా, రా తల్లీ! ఈ కారు ఎక్కమ్మా! చందాలు పది వేలు వసూలు చేసెదము. జమీన్‌వారు పదివేలమ్మా" అన్నారండి. ఆ అమ్మాయి తియ్యటి మూర్ఛపోయిందండీ తందానా తందానా! జై జై జై జై! తందాన తాన!

కథ కంచికి, మనం హైదరాబాదండీ తాన తాన
తండనాన తానా!